

● చెరువుగూడెంలో రూఫ్‌లెవల్‌లో నిలిచిపోయిన పనులు



● మత్తడిగూడలో నిర్మాణం పూర్తి అయి ప్రారంభోత్సవం జరుపుకున్న గ్రామ పంచాయతీ కార్యాలయం భవనం



● కామాయిపేట్‌లో రూఫ్‌లెవల్‌లో ఉన్న పంచాయతీ భవన పనులు



● సాలెవాడ(బి) గ్రామంలో అర్ధాంతరంగానే ఆగిన పంచాయతీ భవన పనులు

నిధుల.. గ్రహణం

- జిల్లాలో నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణాలు
- ఏజెన్సీలో వీటీడీఏ (గ్రామ గిరిజన అభివృద్ధి సంఘం)లకు పనుల అప్పగింత
- ఇప్పటికీ నిధులు మంజూరు కాక.. అప్పుల పాలవుతున్న కాంట్రాక్టర్లు!!
- పలు గ్రామాల్లో నత్తనడక కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు
- మరి కొన్నిచోట్ల అర్ధాంతరంగానే ఆగిపోయిన వైనం
- నిధుల మంజూరీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై భారీ ఆశలు
- ఉమ్మడి జిల్లాలోని 229 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాలకు గతంలో రూ.45.80 కోట్ల మంజూరు

ఉట్నూర్, జూలై 21: 'ఇళ్ల అలంకగానే పండుగ కాదు' అన్న చందంగా ప్రభుత్వాల విధానాలు మారుతుండడంతో సంబర పడిపోయిన గ్రామ పంచాయతీల సర్పంచులు.. వారి పదవీ కాలం ముగియగానే గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి నిధుల గ్రహణం పట్టింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే పంచాయతీ భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాగా.. అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నేటికీ నిధుల లేమితోనే కొనసాగుతున్నాయి. 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా భవనాల నిర్మాణాల పనులు అర్ధాంతరంగా ఉండిపోతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 229 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాల కోసం రూ.45.80 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఆదిలాబాద్ జిల్లాలో 115 నూతన భవనాల నిర్మాణ పనుల కోసం రూ.23 కోట్లు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 52 పంచాయతీ భవనాల నిర్మాణాల కోసం రూ.10.40 కోట్లు, మంచిర్యాల జిల్లాలో 16 పంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.3.20 కోట్లు, నిర్మల్ జిల్లాలో 46 పంచాయతీ భవనాల కోసం రూ.9.20 కోట్లు మంజూరయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నిధులు మంజూరై పనులు ప్రారంభం కాగా.. నిధులు రాకపోతుండడంతో ఆయా ప్రాంతాలలోని పంచాయతీ భవనాల నిర్మాణదారులు ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారు.

నత్తనడకన నిర్మాణాలు!

గ్రామీణ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని ప్రకటించి అన్ని పంచాయతీలకు భవనాలు నిర్మిస్తామని ఉమ్మడిజిల్లాలో 229 గ్రామ పంచాయ తీ భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో ఐటీడీఏ ఇంజనీర్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రామ పంచా యతీ భవనాల నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయి. జిల్లాలోని అంకోలిలో రూఫ్ లెవెల్ వరకు, అల్లికోరిలో ప్రారంభ దశలో, అసోద, బూర్నూర్‌లో బేస్మెంట్ స్థాయిలో.. ఇలా ఆరు భవనాలు ఉన్నాయి. బోథ్ నియోజకవర్గంలో చించుదరి, హత్తిగుట్ట, సోముగూడ, ధామన్‌గూడ, గర్కంపేట్, గొందుగూడ, జాముల్‌ధర, లింగుగూడ, కునికాస, బోథ్ చింతగూడ, కంటిగాం ప్రాంతాలలో బేస్మెంట్ లెవెల్ వరకు, లోహర, పెద్దమాలే బోరెగాం, చింతలబోరి, అందుగూడ, గిరిజాయి, కుంటాల, లక్ష్మంపూర్(జి), కారా, మసాల(కె), పిట్టగూడ, కామాయిపేట్, మరుగూడ, నర్సాపూర్(జె), చెరువుగూడ, హీరాపూర్, ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ తండా మండలపల్లి పిట్టబొంగరం, సమాక ప్రాంతాలలో రూఫ్ లెవెల్ వరకు నిర్మల్ జిల్లా తానూర్ మండలం కొల్లూరితండాలో బేస్మిట్ లెవెల్ వరకు, బామినితండాలో రూఫ్ లెవల్ వరకు మాత్రమే పనులు జరుగగా అటవీ శాఖ అడ్డంకుల వల్ల కాగజ్‌నగర్ ప్రాంతంలో ఓ లైన్‌గ్రైడ, మాలిన, దహేఆగం, మండలం దిగిడ, సిర్పూర్(టి) మండలంలో సుస్మీర్‌లలో పంచాయ తీ భవనాలు మంజూరైనా.. పనులు ప్రారంభం కాలేదు. ఉట్నూర్ మండలం లో ని లింగోజి తండాలో స్థలం అందుబాటులో లేక పనులు ప్రారంభించ లేదు. ఇప్పటి వరకు జిల్లాలో 115 గ్రామ పంచాయతీలో గాను ఏడు పంచాయతీలలో పూర్తికాగా.. 91 పనులు పురోగతిలో ఉండగా, మిగతా భవనాలు అలానే ఉన్నాయి. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 52 పనులకు గాను,ఒకటి పూర్తికాగా 38 పురోగతిలో ఉండగా.. 13 పనులలో 4 అటవీ శాఖ అడ్డంకులతో, ఐదు భూములు అందుబాటులో లేక, 4 పనులు ప్రారంభించక అలానే ఉన్నాయి. అలాగే మంచిర్యాల జిల్లాలో 16 త్వరలో మంజూరు కాగా, 11 పురోగతిలో ఉండగా ఐదు పనులు వివిధ అడ్డంకుల వల్ల నిలిచిపోయాయి. నిర్మల్ జిల్లాలో 46 పంచాయతీ భవనాలకు గాను.. మూడు పనులు పూర్తి కాగా, 35 పనులు పురోగతిలో ఉండగా.. 8 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణ పనులు వివిధ అడ్డంకుల వల్ల ప్రారంభం కాలేదు.

అప్పుల పాలవుతున్న కాంట్రాక్టర్లు!!

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 229 గ్రామ పంచాయతీ భవనాలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణ పనులను గ్రామ గిరిజన అభివృద్ధి సంఘాలకు (వీటీడీఏ)ల ద్వారా పనులు చేయాలని భావించింది. ఇంజనీరింగ్ అధికారులు వీటీడీఏలకే పనులు అప్పగించారు. కానీ, కొన్ని ప్రాంతాలలో వీటీడీఏల వద్ద ధనబలం లేకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు చేరిపోయి పనులు చేపడుతున్నారు. కొందరు వీటిని ప్రెసిడెంట్లు కూడా వడ్డీలతో డబ్బులు అప్పులు చేసి పనులు చేస్తున్నారు. ఉట్నూర్ మండ లంలో మత్తడిగూడ, బజార్‌హత్నూర్ మండలంలో తాంద్ర, బేల మండలంలో మసాల(బి), ఇంద్రవెల్లి మండలంలో అంజి, వల్గొండ, కుంటాల కె గ్రామాలలో పంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ.. పనులు చేసిన వారికి డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేస్తున్న వారు సైతం అప్పులు చేసి పనులు చేస్తున్నామని.. వివిధ దశల్లో తమకు డబ్బులు ఇస్తే పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని అంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని పంచాయతీల భవనాలు పూర్తి అయ్యే విధంగా నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజలు కోరుతూ భారీ ఆశలు పెట్టుకున్నారు.

అప్పు చేసి మరీ నిర్మించాను

: మాడావి మోతిరాం, వీటీడీఏ అధ్యక్షుడు, మత్తడిగూడ



ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ గ్రామంలో రూ. 20లక్షల వ్యయంతో గ్రామ పంచాయతీ భవనం పనులు పూర్తి చేశాను. మూడు శాతం వడ్డీతో అప్పు చేశాను. పనులు పూర్తికావడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం కూడా చేసి ఐదు నెలలు అవుతుంది. కానీ నిధులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను.

పంచాయతీ భవనాల పనులు జరుగుతున్నాయి

: రాథోడ్ భీమ్‌రావు, ఈఈ, ఐటీడీఏ ఉట్నూర్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 45.80 కోట్లతో 229 భవ నాల పనులు మంజూరు కాగా.. పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 11 పనులు పూర్తికాగా.. 175 పనులు పురోగతిలో ఉన్నాయి. 43 భవనాల పనులు వివిధ కారణాలతో నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే.. మరింత వేగంతో పూర్తి చేస్తాం.

సంక్షిప్త సమాచారం



మొక్కలు నాటుతున్న డైరెక్టర్ జైసింగ్, వైద్యులు

రిమ్స్‌లో వన మహోత్సవం

ఆదిలాబాద్ రూరల్, జూలై 21: ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కి అనుబంధంగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ముందు భాగంలో ఆదివారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌తో పాటు వైద్యులు సత్యనారాయణ, తిప్పే స్వామి, చంపత్‌రావు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. రిమ్స్‌ను హరితవనంగా మార్చడానికి వెయ్యి మొక్కలు నాటడంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు డైరెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నేడు భీమన్న దేవుడి పండుగా

ఆదిలాబాద్ అర్బన్, జూలై 21: భీమన్న దేవుడి పండుగను సోమవారం నిర్వహించనున్నట్లు తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య తెలిపారు. ఆదివారం గాంధీ పార్కులోని భీమన్న ఆలయంలో ఏర్పాట్లను సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో గల భీమన్నఆలయంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించేల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్కులో ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ముదిరాజ్ బంధువులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి : తపస్

ఇచ్చోడ, జూలై, 21: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ పేర్కొన్నారు. ఆదివారం ఇచ్చోడ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చోడ మండల తపస్ అధ్యక్షుడిగా రాజన్న, ఉపాధ్యక్షుడిగా రాథోడ్ రమేష్, కార్యదర్శి జాదవ్ ఓంప్రకాష్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఆర్థిక కార్యదర్శి అఖిల్‌తో పాటు తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

'రుణమాఫీ చేయడంలో విఫలం'

జైనథ్, జూలై 21: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం ఆరోపించారు. ఆదివారం జైనథ్ మండలంలోని నిరాల గ్రామంలో గల త్రినేత్ర గార్డెన్‌లో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్ అధ్యక్షతన పార్టీ మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై బ్రహ్మానందం మాట్లాడుతూ ఇటీవల రైతులకు రుణమాఫీ విషయంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులు అందరికీ తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కుంటాల జలపాతానికి పర్యాటకుల నిలిపివేత

● 3రోజుల పాటు సందర్శన నిలిపివేత : ఎఫ్ఆర్‌వో ● భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు ● పరవళ్లు తొక్కుతున్న 'కనకాయి'



కుంటాల జలపాతం వద్ద వాహనాలను తిప్పి పంపుతున్న అధికారులు



జలపాతానికి పోటెత్తిన వరదనీరు



వర్షపుధారలతో కనకాయి జలపాతం హొయలు



బురదమయంగా ఉన్న జలపాతానికి వెళ్లే దారి

నేరడిగొండ, జూలై 21: రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందిన కుంటాల జలపాతం సందర్శనను మూడు రోజుల పాటు నిలిపి వేసినట్లు ఎఫ్ఆర్‌ఓ గణేష్ తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పర్యాటకులకు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా 3రోజులు పర్యాటకులకు అనుమతులు నిరాకరించడం జరిగిందన్నారు. అంతేకాకుండా నేరడగొండ కుంటాల క్రాస్‌రోడ్ వద్ద అటవి పోలీసు శాఖ అధికారులు కుంటాల వెళ్లే వాహనాలను తిప్పి పంపుతున్నారు. తనిఖీ చేసే వారిలో ఎఫ్ఎస్‌వో వసంత్ కుమార్, ఎఫ్‌బీవో సచిన్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

● కనకాయి జలపాతానికి జలకళ

బజార్‌హత్నూర్: మండలం పరిధిలో గత 3రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు. వంకలు, ఒర్రెలకు వరదనీరు వచ్చి చేరడంతో గిర్నూర్ గ్రామం పరిధిలోని కనకాయి జలపాతానికి వరదనీరు రావడంతో జలపాలతం జల కళ సంతరించుకుంది. ఎత్తైన బండరాళ్లపై నుంచి వరదనీరు జాలువాడంతో పాల పొంగు వలే నీరు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తోంది. పచ్చని చెట్ల మధ్య ప్రకృతి రమనీయతను సంతరించుకున్న జలపాతం వద్ద పక్షుల కిలకిల రాగాలు, జలపాతం సవ్వళ్లు, పర్యటుకులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి.

● సౌకర్యాలు లేక సందర్శకులకు ఇబ్బంది

జలపాతం వద్ద ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు మార్గం కూడా సరిగ్గా లేకపోవడంతో పర్యాటకులు కాలినడకన జలపాతానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం జలపాతం వద్ద తగిన సౌకర్యాలు కల్పిస్తే మరింత మంది పర్యాటకుల వచ్చే అవకాశం కలుగుతుందని గ్రామస్థులు తెలిపారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో గాలిస్తున్న దృశ్యం

గంగాపూర్ వాగులో ఒకరి గల్లంతు

● గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు ముమ్మరం



గంగాపూర్ వాగు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఉట్నూర్, జూలై 21: మండలంలో శనివారం కురిసిన భారీ వర్షాలకు గంగాపూర్ వాగులో వరదనీటిలో గిరిజనుడు గల్లంతు అయినట్లు సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఉట్నూర్ మండలంలోని బొప్పరికుంటకు చెందిన గిరిజనుడు టేకం లక్ష్మణ్ వాగులో కొట్టుకుపోయినట్లు అతని వెంట ఉన్న టేకం రాజు ఆదివారం ఉదయం గ్రామస్థులకు తెలిపారు. ఉట్నూర్ వైపు నుంచి బొప్పరికుంట వెళ్లడానికి లక్ష్మణ్, రాజు కలిసి గంగాపూర్ వాగులోని చెక్‌డ్యాంగుండా వెళ్తుండగా టేకం లక్ష్మణ్(28), టేకం రాజులు ఇరువురు వాగు ప్రవాహం నీటిలో పడిపోగా రాజు బయటపడి సమీపంలో ఉన్న పంట చేనులో ఉన్న గుడిసెలో రాత్రికి తలదాచుకుని, ఆదివారం ఉదయం సంఘటన గురించి తెలపడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ వాగు వద్దకు చేరుకుని పరిస్థితి సమీక్షిస్తున్నారు. ఎస్సై మనోహర్, హెడ్‌కానిస్టేబుల్ నాగన్నలు గంగాపూర్ వాగులో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. వాగు ఉధృతికి లక్ష్మణ్ పరిస్థితి ఎలా ఉందో చెప్పలేమని పోలీసులు అంటున్నారు. బొప్పరికుంటలో టేకం లక్ష్మణ్ కుటుంబసభ్యులు అతని కోసం రాత్రి నుంచి ఎదురు చూస్తున్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

● అవసరమైతే అధికారులకు సమాచారం ఇవ్వండి : నేరడిగొండ ఎంపీడీవో ● లోతట్టు ప్రాంతాలలో జాగ్రత్తగా ఉండాలి : భీంపూర్ తహసీల్దార్

నేరడగొండ, జూలై 21: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఉప్పొంగిన వాగు.. ఊరికి తప్పని ఆపద' అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సేవదాస్ గ్రామ సమీపంలో గల వాగు వద్దకు వెళ్లి ప్రమాద స్థాయిని పరిశీలించి ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. గ్రామస్థులు అత్యవసరముంటే అధికారులను సంప్రదించాలని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. వరద ప్రవాహానికి చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకోవద్దన్నారు. వాగులు వంకలు పరివాహక ప్రాంతాల ప్రజలు వెళ్లే దారిలో పంచాయతీ సిబ్బంది నిఘా పెంచాలన్నారు. ఇందులో ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, గ్రామస్థులు, తదితరులున్నారు.

అలాగే, జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బోథ్ నియోజక వర్గంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. అత్యవసరం అయితే తప్ప బయటకి రాకూడదని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశాలు ఉంటాయని సూచించారు.

భీంపూర్: వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సత్యనారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో సూచనలు చేశారు. ప్రధానంగా పెన్ గాంగా పరివాక గోళ్ళగడ్, తాంసి(కె), అంతర్‌గాం, గుబ్‌డి, వాడూర్ గ్రామాల ప్రజలు వరద పరిస్థితిని గమనిస్తూ ఉండాలని కోరారు. అవసరం అయితే దిగువ ప్రాంతాల్లో ఇళ్ల ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలలో ఆశ్రయం పొందాలన్నారు. అవసరం అయితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. తహసీల్దార్ సిబ్బంది గ్రామాలలో అందుబాటులో ఉంటారని వారి సహా యం తీసుకోవాలన్నారు. అవసరం అయితే ఫోన్ నెం.9989598010 కు సమాచారం ఇవ్వాలని, ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు.


బోథ్: మండలంలోని వాగుల వద్ద ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోథ్ ఎస్సై బి.రాము సూచించారు. దీనిలో భాగంగా ఆదివారం మండలంలోని నక్కలవాడ గ్రామాన్ని సందర్శించి స్థానికులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ సందర్భంగా వాగు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జేసీబీ సహాయంతో తొలగించారు. వరదతో ఉన్న నీటిని దాటవద్దని పేర్కొన్నారు.




సేవదాస్‌నగర్ వాగును పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్



నక్కలవాడ వాగు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై రాము







పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇంద్రవెల్లి, జూలై 21: మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 22ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీ యంగా పలుకరించుకుని విందు, వినోదాలతో సాయంత్రం వరకు సందడిగా గడిపారు. విద్యార్థి దశలో చిలిపి చేష్టలు మరువలేనివని, విద్యాబుద్దులు నేర్పిన గురువులు ఎంఈవో నారాయణ, విశ్రాంత హెచ్‌ఎం శివాజీ, ఉపాధ్యాయకులు కాంబ్లే ప్రీతమ్, శ్యామ్‌కుమార్, మల్లేశం, రంజన మేడమ్, సుభాష్‌చంద్రబోస్, దత్తాగిరి, రాజన్న, కిషన్‌రావు, రవీందర్, విఠల్‌రావు తదితరులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. నాటి ఉపాధ్యాయులను శాలువావతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు స్వీకరించారు. సుమారు 70మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరడంతో సందడి నెలకొని ముఖాల్లో వెలుగులు నిండాయి. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నెంబర్లు తీసుకోవడంతోపాటు మధుర జ్ఞాపకాలను తమ ఫోన్‌లో బంధించుకున్నారు. గురువులతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగి సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు మాజీ కోఆప్షన్ సభ్యులు మిర్జా జిలానీ బేగ్, సహకార సంఘం సీఈవో ధర్మసింగ్, రావత్ సాయినాథ్, కేంద్రే జ్ఞానేశ్వర్, జనార్ధన్, శైలేందర్, నీలేష్, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళ ఆత్మహత్య

ఉట్నూర్, జూలై 21 : మండలంలోని సాలెగూడలో పురుగుల మందు తాగి గిరిజన మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది. కాలేవులకు చెందిన ఆత్రంమారు సతీమణి ఆత్రం మహేశ్వరి(26) శనివారం రాత్రి పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి పోవడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో రిమ్స్‌కు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో గుడిహత్నూర్ వద్ద మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమే పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. మృతురాలికి నాలుగు సంవత్సరాల కొడుకుతో పాటు పది నెలల పాప ఉందన్నారు.

పౌరదేవిని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, జూలై 21 : గురుపౌర్ణమిని పురస్కరించుకుని మహారాష్ట్రలోని బంజారా కాశీ అని పిలబడే ప్రముఖ పుణ్యక్షేత్రం పౌరదేవిని ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దర్శించుకున్నారు. బంజారాల దైవం సంత్‌సేవలాల్ మహరాజ్ శిష్యులు బంజారా ప్రజల ఆరాధ్యదైవం బంజారా గురు సంత్‌శ్రీ రామారావు మహరాజ్ పుణ్య సమాదిని సంత్ శ్రీశేఖర్ మహారాజ్‌తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోథ్ నియోజక వర్గ ప్రజలపై తల్లి జగదాంబదేవి సేవలాల్ మహారాజ్ ఆశీస్సులు ఎల్లవేళల ఉండాలని కోరారు. ఆయన వెంట ధర్మ ప్రచారక్ ప్రేమ్‌సింగ్, విష్ణుపర్సురాం తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్, జూలై 21: నియోజక వర్గంలోని ఆయా గ్రామాల్లో గల ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ స్పష్టం చేశారు. ఆదివారం బేల మండలంలోని టాక్లి గ్రామంలో పాయలశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాట్‌ను నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జీ బోయర్‌విజయ్, బీజేపీ బేల మండలా పార్టీ అధ్యక్షులు దత్తనికమ్‌లతో పాటు టాక్లి గ్రామ ప్రజలు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అగ్రవర్ణ నిరుపేదలకు రిజర్వేషన్ ఘనత మోదీదే'

మావల, జూలై 21: అగ్రవర్ణ నిరుపేలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మ నాయ కల్యాణ మండపంలో నిర్వహించిన వెలమ ఎంప్లాయిస్, పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెలమ కులస్తులు ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెల్మ సంఘం అభివృద్ధితో పాటు కులస్తుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ సంఘం ప్రాంతీయ కమిటీ బాధ్యులు జగన్న, మనోహర్, ఆదిలాబాద్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ రంగినేని మనీషా, పవన్‌రావు, జైనథ్ మండల మాజీ అధ్యక్షుడు రోకండ్ల రమేష్, వెంకట్‌రావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విలీన కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి...

గతంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో మున్సిపాలిటీలో విలీనం చెందిన వార్డులు అభివృద్ధి చెందలేదని, విలీన కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నిల్వగా ఉన్న నీటిని పరిశీలించారు. ఈ మేరకు కాలనీ వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో విలీన కాలనీలలో సరైన రోడ్లు, మురికి కాలువ లేక పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందన్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. గతంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో విలీన వార్డులు అభివృద్ధి చెందలేదన్నారు. అంతకు ముందు టీచర్స్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణిమ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు ఘన సన్మానం

తలమడుగు, జూలై 21: రాష్ట్ర వైష్ణవ సేవ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మేదగూడలోని పీఎంఆర్ కన్వెన్షన్‌లో జిల్లా నుంచి ఒకరికి సన్మానం చేయగా ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి తలమడుగు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ వేద పండితులు నేరేళ్ళ కళ్యాణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో త్రిదండి రామానుజ రామచంద్ర జియర్ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొనగా మాజీ తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ ఛైర్మన్ సముద్రాల వేణుగోపా లచారి వైష్ణవ సంఘం పెద్దలు వేద పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ వేద పండితునికి రాష్ట్రంలో సన్మానం లభించడం పట్ల ఆలయ అధ్యక్షుడు ముద్దాం ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యక్షులు మంతే రమేష్, బదిగారి స్వామి యాదవ్, రాముడ్డిలు ఆనందం వ్యక్తంచేశారు.

గిరిజన గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

తలమడుగు, జూలై 21: మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గణేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆదివాసి గ్రామాలైన కోసాయి, ఉమ్రి గ్రామాలలో మాజీ జడ్పీటీసీ, ఎంపీపీలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ గిరిజనులకు ఎలాంటి లాభం చేయలేదన్నారు. గిరిజన బంధు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. వారికి ఎకరం భూమి కూడా ఇవ్వలేదన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తామని హామీనిచ్చారు. అనంతరం ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, వైస్ ఎంపీపీ పేందూర్ దివ్య మాధవ్, ఎంపీటీసీలు వెంకన్న, హన్మంతును శాలువాలతో సన్మానించి మండలంలోని ఆదివాసి గ్రామాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వనమాల, మాజీ ఎంపీటీసీలు దాదారావు, లస్మన్న, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 21: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే జన్మదిన వేడుకలను ప్రజాసేవభవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ మాట్లాడుతూ అసెంబ్లి ఇన్‌చార్జీక కంది శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఓ దళిత బిడ్డకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు.

మావల: అఖిల భారతీయ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మావలలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, రాజన్న, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, సురేష్, ప్రవీణ్, గౌతమ్, వెంకటేష్, దినేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


ఇచ్చోడ, జూలై, 21: భూమి కోనుగోలు విషయంలో మధ్య వ్యక్తిగా ఉన్న యువకుడు అమ్మకదారు, కొనుగోలుదారు చేసిన వేధింపులు తట్టుకోలేక షేక్ మౌసిన్(38) పురుగులమందు తాగిన సంఘటన ఇచ్చోడ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గతనెల 16న పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డా ఇచ్చోడ వాసి చికిత్స పొందుతూ.. ఆదివారం మృతిచెందాడు.













గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో పూజలు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

● సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు ● బాసర సరస్వతీ ఆలయంలో ముగిసిన చండీ హోమం

భైంసా: పట్టణంలోని బాగుబాయి గుట్ట సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పౌర్ణమి వేడుకల్లో పాల్గొని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు సాయిసచ్చరిత పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం వేళలో ప్రత్యేక హరతి నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం వేళలో పల్లకీ సేవ, రాత్రివేళలో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

ఖానాపూర్: మండల కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీవీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సాయినాథుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో సాయినాథుడి పల్లకీసేవ నిర్వహించారు. గురుపౌర్ణమి పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకలకు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ హాజరై సాయినాథుడిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జాన్సన్‌నాయక్‌ను స్థానిక ఆలయపూజారులు శాలువాతో సత్కరించారు. ఆయనవెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు రాము నాయక్, రాజగంగన్న, కొక్కుల ప్రదీప్, గౌరీకర్ రాజు, శనిగారపు శ్రావణ్, తోట సుమిత్, అడిదెల మహేందర్, తదితరులున్నారు.

బాసర: బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యాస ముని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి వ్యాసమహర్షి జయంతి సందర్భంగా అభిషేక పూజలను నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న చండి హోమం పూజను పూర్ణాహుతితో ముగించారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అమ్మవారిని దర్శించుకున్నారు. గురుపౌర్ణమి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈవో విజయరామరావు పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్: పౌర దేవి పీఠాధిపతి శ్రీ బాబు సింగ్ మహారాజ్ ఆదేశాల మేరకు శ్రీ రామారావు మహారాజ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి తండాలో ఆదివారం గురు పూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆల్ ఇండియా బంజారా సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు తుకారాం రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా పల్లకిలో ఒక కొబ్బరికాయ అమర్చి శ్రీసంత్‌సేవాలాల్ హారతి తీసుకొని భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బంజారా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మల్‌అర్బన్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ ఈవో రమేష్‌తో పాటు సాయి దీక్షసేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్న హారతి కార్యక్రమంలో జిల్లా కోర్టు జూనియర్ న్యాయాధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయనకు ఈవో రమేష్, జగన్మోహన్ రెడ్డిలు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సాయి దీక్ష సేవాసమితి సభ్యులు డాక్టర్ ప్రవీణ్, పూదరి నరహరి, ఉప్పుల నందు, లింగారెడ్డి, సుదర్శన్, జిందం గోవర్ధన్, రామచందర్ మాస్టర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి రూ.20 లక్షలతో బంగారు వర్ణ తాపడం

నిర్మల్ చైన్‌గేట్: నిర్మల్‌కు చెందిన లక్కడి సోదరులు 20లక్షలతో ఖర్చు బంగారు వర్ణ తాపడాన్ని చేయించారు. లక్కడి జగన్మోహన్ రెడ్డి, జైపాల్ రెడ్డి సోదరులు సాయిబాబాపై ఉన్న భక్తితో ఆలయ అభివృద్ధికి గత కొంతకాలంగా స్వచ్ఛందంగా నిధులు వెచ్చిస్తున్నారు. షిరిడి సాయి తరహాలో ఉండాలని తపనతో ఏకంగా రూ.20లక్షలు వెచ్చించి ఆలయానికి బంగారు వర్ణ తాపడాన్ని చేయించారు. ఈ బంగారు వర్ణ తాపడం ఆదివారం గురు పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా న్యాయాధికారి కర్ణకుమార్ చేతుల మీదుగా ఆలయానికి బహుకరించారు. సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక మార్గంలో ముందు వరుసలో నిలుస్తున్న లక్కడ సోదరులను జిల్లా న్యాయమూర్తి అభినందించారు. అనంతరం దత్తసాయి ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయఈవో రమేష్, డాక్టర్ ప్రవీణ్, నందు, లింగారెడ్డి, నారాయణరెడ్డి, నరహరి, తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా మునిపెల్లి గ్రామంలోని శివదత్తసాయినాథ ఆలయంలో గల సాయిబాబా, దత్తాత్రేయ, శివలింగాలకు అభిషేకం చేసి నూతన వస్త్రాలను అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే గ్రామ ముఖ ద్వారంలో గల నందీశ్వరుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ప్రధాన వీధులగుండా పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. హారతి అనంతరం తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

కుంటాల: కుంటాల మండలంలోని కల్లూర్ దత్త వెంకటసాయి మందిరంలో ఆదివారం వ్యాస మహర్షి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పలువురు గురువులను సన్మానించారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కల్లూరులోని దత్త వెంకటసాయి ఆలయంలో..



మునిపెల్లిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



గడ్డెన్నవాగు ప్రాజెక్టులోని నీటి నిల్వలు

గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరద

● భైంసా డివిజన్‌లో 50 మి.మీ. వర్షపాతం నమోదు

భైంసా, జూలై21: ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల మూలంగా గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతూ పోతోంది. ఆదివారం ప్రాజెక్టులోకి 335 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఈ క్రమంలో శనివారం ప్రాజెక్టు నీటి మట్టం 355.8 మీటర్లు ఉండగా ఆదివారం వరద నీటి చేరికతో 355.9 మీటర్లకు పెరిగింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వల సామర్థ్యం 1.852 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 0.733 టీఎంసీల నీటి నిల్వలున్నాయి.

● డివిజన్‌లో భారీ వర్షం

ఆదివారం డివిజన్ పరిధిలో 50 మి.మీ. వర్షపాతం నమోదైంది. లోకేశ్వరం మండలంలో 69.4 మి.మీ., కుంటాలలో 59.4 మి.మీ., కుబీర్‌లో 53.6 మి.మీ., బాసరలో 47.4 మి.మీ., ముథోల్‌లో 43.8 మి.మీ., భైంసాలో 42.4 మి.మీ., తానూర్‌లో 33.2 మి.మీ. వర్షం కురిసింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో డివిజన్‌లోని చేరువులలో వరద చేరిక మొదలైంది. వాగులు, వంకలలో నీటి ప్రవాహం జోరందుకుంటోంది. లోతట్టు ప్రాంతాల్లో వర్షను నీరునిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లోని పంటచేలు జలమయమయ్యాయి. సాగుకు అనుకూలమైన వాతవరణం ఉండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'మున్సిపల్ పోరుకు సిద్ధం కావాలి'

భైంసా, జూలై 21: రానున్న మున్సిపల్ పోరుకు బీజేపీ శ్రేణులు సిద్ధమవ్వాలని ఆ పార్టీ ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు నగర్ నారాయణరెడ్డి, గోపాల్ సర్దాలు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కమిటీ పార్టీఅధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగిన భైంసా మున్సిపల్ బీజేపీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ పోరుకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవ్వాలన్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లే, ప్రతినిధులు రావుల పోశెట్టి, సాహేబ్‌రావ్,తోట రాజు, గాలి రాజు, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు నందు భయ్యా, ప్రధాన కార్యదర్శి భూ కిరణ్, తదితరులు ఉన్నారు.

సొంత ఇంట్లోనే దొంగతనం.. వ్యక్తి అరెస్టు

నిర్మల్‌టౌన్, జూలై21: ఓ వ్యక్తి తన ఇంట్లోనే దొంగతనం చేసి పోలీసులకు దొరికిపోయాడు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని మహాదేవపూర్ కాలనీకి చెందిన ఓ మహిళ ప్రభుత్వ ఉద్యోగిగా విధులను నిర్వహిస్తోంది. ఈనెల 19న రోజులాగే ఉదయం భర్త బైక్‌పై పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటితలుపులు తెరిచిఉండి లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో 8తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే దొంగతనం జరిగినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. కేసునమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా చుట్టుపక్కల గల సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా దీంతో ఆమె భర్త శివనే దొంగతనం చేసినట్లు గుర్తించారు. అతడిని పట్టుకొని విచారించగా తనే నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.3,20,000 విలువ చేసే 8.1 తులాల బంగారు ఆభరణాలు, 6తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించినట్లు సీపీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రజలందరూ వారి ఇళ్ల ముందు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నేరాలను అరికట్టడంలో ఇవి ఎంతో తోడ్పడుతాయని తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటిలో బాధితురాలు

లక్ష్మణచాంద, జూలై 21: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండల కేంద్రానికి చెందిన మామడ రాజవ్వ ఇల్లు ఆదివారం కూలింది. స్థానికుల వివరాల ప్రకారం గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఈ ఇల్లు తడిసి కూలిపోయింది. ఇల్లు కూలడంతో సరుకులు, వస్త్రాలు, తదితర సామగ్రి పాడై రూ.లక్ష ఆర్థికనష్టం వాటిల్లింది.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నర్సాపూర్(జి), జూలై21: కొత్తగా పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి స్రవంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బీమాకు జూన్ 28, 2024 నాటికి ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల వివరాలు వ్యవసాయ శాఖకు అందినట్లు పేర్కొన్నారు. నూతనంగా పట్టాపాస్‌పుస్తకాలు పొందిన రైతులకు రైతు బీమా వర్తింపజేస్తామని, ఇందుకుగాను దరఖాస్తులను ఆగస్టు 5వ లోపు ఏఈవోలకు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను రైతులు అందజేయాలని తెలిపారు. బీమా వర్తించాలంటే నిర్ణీత తేదిలోగా వివరాలన్నీ కోరారు. అలాగే రైతు బీమాలో తప్పుల సవరణకు ఈనెల 30వ తేది వరకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.



తనిఖీ నిర్వహిస్తున్న ఎస్సై, సిబ్బంది

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఎస్సై

కుంటాల, జూలై21: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కుంటాల ఎస్సై రజనికాంత్ అన్నారు. ఆదివారం మండలంలోని భైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై అర్లి ఎక్స్‌రోడ్డు సమీపంలో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని అన్నారు. నాలుగుచక్రాల వాహనచోదకులు సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్నిపత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ఘనంగా ఉట్ల పండుగ

కుబీర్, జూలై 21: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో ఆదివారం ఉట్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని దేవతామూర్తులకు ప్రమోద్ మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్ని కృష్ణుని వేషాదారణలో ఉట్టిని పగలగొట్టి భక్తులకు పంచిబెట్టారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధులగుండా భక్తి గేయాలను ఆలపిస్తూ శోభయాత్ర నిర్వహిస్తూ గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు డా.పెంటాజీ, నాయకులు ప్రసాద్, విఠల్, సంతోష్, సందీప్, గ్రామస్థులు తదితరులున్నారు.



కుభీర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



రాంబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానం చేస్తున్న పీవో, అధికారులు

పని చేస్తున్న ప్రాంతంలో పేరు తెచ్చుకోవాలి : ఐటీడీఏ పీవో

ఉట్నూర్, జూలై 21: ఎవరు ఎక్కడ పని చేసినా.. ఉద్యోగ ధర్మాన్ని కాపాడుతూ పని చేస్తున్న ప్రాంతాలలో పేరు తెచ్చుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. శనివారం రాత్రి ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీపీఎస్ సమావేశ మందిరంలో సాధారణ బదిలీలలో భాగంగా ఐటీడీఏ ఉట్నూర్ పరిపాలనాధికారి ఏటూరునాగారం ఐటీడీఏకు బదిలీ కావడంతో ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో హాజరై మాట్లాడారు. రాంబాబు వారి విధులకు వందశాతం న్యాయం చేశారని, మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఇందులో డీడీ డా.దిలీప్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాథోడ్ భీంరావు, అదనపు వైద్యాధికారి మేస్రం మనోహర్, ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి సందీప్ కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, జేడీఎం జాబ్స్ నాగభూషణం, ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బొజ్జుకు వినతి

ఉట్నూర్, జూలై 21: తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే, ఎంపీలకు వినతి పత్రాలు ఇవ్వాలని సంఘం ఇచ్చిన పిలుపు మేరకు మండలకేంద్రంలో సమగ్రశిక్ష ఉద్యోగులు ఆదివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గత 15ఏళ్లుగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదికతో కూడిన వినతిపత్రాన్ని అందించి ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన వాగ్దానాలు నేరవేర్చి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లి అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ధరమ్‌సింగ్, వినోద్‌కుమార్, కైలాస్, గణపతి, బీర్శావ్, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్ ఆరోపణల్లో వాస్తవం లేదు'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 21: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల వ్యవధిలో రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేసిందని, ఆగస్టు చివరి వరకు రూ.రెండు లక్షల రుణమాఫీ కూడా చేస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తెలిపారు. ఆదివారం ప్రజాసేవభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రైతులను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతు రుణమాఫీ ఎందుకు కాలేదని? ప్రశ్నించారు. రైతు బంధును రియల్ ఎస్టేట్, ఖాళీ భూములకు ఇచ్చారన్నారు. అదే కాంగ్రెస్ అసలైన రైతులకు అందించాలనే లక్ష్యంతో అభిప్రాయ సేకరణ చేస్తుందని తెలిపారు. దీన్ని తప్పుబడుతు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో గురుపూర్ణిమ వేడుకలు

● నాయక్‌నగర్‌లో ఘనంగా బోగ్‌బండారా ● రామారావు మహరాజ్‌కు నివాళ్లర్పించిన బంజారా నాయకులు
● ఇంద్రవెల్లిలో గోండి ధర్మ గురు హీరసుక్క చిత్రపటానికి ప్రత్యేక పూజలు ● పాల్గొన్న ఆదివాసీ గిరిజన నాయకులు

ఉట్నూర్, జూలై 21: ఉట్నూర్ మండలకేంద్రంలోని నాయక్‌నగర్‌లో గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారం బోగ్‌బండార నిర్వహించారు. సంత్ రామారావు సేవ బాయబంజారా ఆరాధ్యుడు జాదవ్ చంద్రకాంత్‌నాయక్ ఆధ్వర్యంలో సంత్ డా.రామారావు మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్‌లోని నాయక్‌నగర్‌లో సేవాలాల్ జెండా వద్ద టీజీటీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు భరత్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో బంజారా సమాజం నాయకులు పవార్ దేవిదాస్, జాదవ్ సురేష్, టీటీఫ్ రాష్ట్ర నాయకులు గణేష్ రాథోడ్ లైవ్ నాయకులు జాదవ్‌వసంత్, బానోత్ రవీందర్, యువసేన నాయకులు జాదవ్‌గోవింద్, జాదవ్ ధనరాజ్, పవార్ విలాస్‌నాయక్, నగర్‌వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: గురు పౌర్ణమి సందర్భంగా ఆదివాసీ ప్రధాన్, పురహిత్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గోండి ధర్మ గురు హీరసుక చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన్‌గూడ గ్రామ పటేల్, గేడం జ్ఞానేశ్వర్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ, జిల్లా ఉపాధ్యక్షులు గేడం భారత్, హీరాసుక్క యూత్ ప్రెసిడెంట్ గేడం ఉమేష్, మడావి విశ్వనాథ్, సోయం రాందాస్, కుమ్ర భీంరావు, గేడం సోనేరావు, కనక భీంరావు, రజనీకాంత్, మెస్రం మురహరి తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో గోండి ధర్మ గురు హీరసుక్క చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదివాసీలు



బోథ్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

● 'బుద్ధుడి బోధనలు మానవాళికి ఆదర్శం'

ఇంద్రవెల్లి: బుద్ధుడి బోధనలు ప్రపంచ మానవాళికి ఆదర్శనీయమని పూజ్య భంతే జీవక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మిలింద్ నగర్ కాలనీలోని త్రిరత్న బుద్ధవిహార్‌లో ఆషాఢం పౌర్ణమి, గురు పౌర్ణమి సందర్భంగా వర్షవాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు గౌతమబుద్ధుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడి బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించి శాంతి మార్గంలో పయణించాలన్నారు. ఈ వర్షవాస్ కార్యక్రమంలో బుద్ధుడు అతని యొక్క ధర్మం, గ్రంధ పఠనం మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు.

ఆదిలాబాద్ అర్బన్: జిల్లాకేంద్రంలో గురుపౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఆయా ఆలయాల్లో భక్తుల తాకిడి నెలకొంది. గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని సాయిబాబా ఆలయాలు,దత్త మందిరంలో భక్తులు ప్రత్యేకపూజాది కార్యక్రమాలను నిర్వహించారు.



ఉట్నూర్‌లో బోగ్‌బండార్ నిర్వహిస్తున్న లంబాడా గిరిజనులు

జైనథ్: సమాజంలో మనిషి జీవితంలో మార్గాన్ని చూపించేది గురువుతోనే సాధ్యమని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని దీపాయిగూడ గ్రామంలోని చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక సందేశాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దీపాయిగూడ మాజీ సర్పంచ్ బొల్లి గంగన్న, ఆదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: గురుపూర్ణిమ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆసిఫాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని పాట్నాపూర్‌లో గల సద్గురు పులాజీ బాబా ధ్యానస్థలిని ఆదివారం తలమడుగు ధ్యాన మందిర కమిటీ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో నీలగిరి అశోక్, భూమయ్య, పోచన, సంజీవ్, కాటిపల్లి సునీతారెడ్డి, అనిత, విజయలక్ష్మీ, రాకేష్, భోజమ్మ, మీనాక్షి, సత్యశీల, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయాన్ని గురు పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అలాగే, బోథ్ మండలంలోని పలు గ్రామాలలో ఉన్న శబరిమాత ఆశ్రమాలలో గురుపూర్ణిమ పౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత విగ్రహాన్ని అలంకరించడం జరిగింది. కౌటా(బి), కనుగుట్ట, దన్నూర్, బోథ్ గ్రామాల్లో ఉదయం పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

డీఎఫ్‌వోకు ఆత్మీయ సన్మానం

ఆదిలాబాద్ రూరల్, జూలై 21: ఆదిలాబాద్ అగ్నిమాపక శాఖ జిల్లా అధికారిగా నాలుగున్నర ఏళ్లు పని చేసి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్తున్న బి.కేశవులుతో పాటు అసిస్టెంట్ డీఎఫ్‌వో జె.గోవర్ధన్ రెడ్డిని ఆదివారం అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించి వీడ్కోలు పలికారు. సుదీర్ఘకాలం ఆదిలాబాద్‌లో పని చేసి బదిలీపై వెళ్తున్నందుకు బాధగా ఉందని డీఎఫ్‌వో బి.కేశవులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ దుర్గె శివాజీ, పలువురు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



డీఎఫ్‌వో, అసిస్టెంట్ డీఎఫ్‌వోలను సన్మానిస్తున్న సిబ్బంది

ఉట్నూర్‌లో ఘనంగా బోనాల పండుగ

ఉట్నూర్, జూలై 21: గ్రామదేవతలు చల్లంగా చూడాలని ఆషాఢ మాసంలో తలపెట్టిన బోనాల పండుగ ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని సార్వజనిక హనుమాన్ ఆలయం ప్రాంగణం నుంచి మహిళలు బోనాలు ఎత్తుకొని వినాయక్‌చౌక్ మీదుగా పోచమ్మ వాడ, ఎంపీడీవో గ్రౌండ్ వరకు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా పోచమ్మ వాడలోని పోచమ్మ, సారగమ్మలకు పూజలు నిర్వహించారు.అక్కడి నుంచి నల్లపోచమ్మ ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు సరూపరాణి, రాజమణి, నర్మదా, లింగామణి, నాగమణి, పురుషులు సాడిగే రాజగోపాల్, చింతల బీమన్న, పోచన్న షావుకారి, పొరండ్ల అనిల్‌కుమార్, వెంకటేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: ఆషాఢ మాసంలో ఘనంగా నిర్వహించే బోనాల పండుగ ఆదిలాబాద్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అశోక్‌రోడ్డులో గల అతి పురాతనమైన పోచమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. బోనాలను సమర్పించేందుకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు.



ఉట్నూర్‌లో నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న మహిళలు




'క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలి'

నిర్మల్‌టౌన్, జూలై21: క్రికెట్ క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి మచ్చగిరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్‌చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు పురుషుల విభాగంలో 19 ఏళ్లు, మహిళల విభాగంలో (ఓపెన్ కేటగిరీ)కి చెందిన క్రీడాకారులు తమ పూర్తి వివరాలతో జిల్లా యువజన, క్రీడల శాఖ నిర్మల్ వెబ్‌సైట్ తేదీ 23.07.2024 మంగళవారం ఉదయం 10 గంటల లోపు తమ పేరును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



● సదర్మాట్ వద్ద రాతి మత్తడి పైనుంచి గోదావరిలోకి దూకుతున్న వరద నీరు

- మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- జలకళతో కనువిందు చేస్తున్న సదర్మాట్, కడెం
- కడెంకు 26 వేల క్యూసెక్కుల వరద
- నాలుగు గేట్లు ఎత్తివేత
- ఖానాపూర్‌లో ఉప్పొంగిన రెంకోని వాగు
- రెండుచోట్ల తెగిన తాత్కాలిక రోడ్లు
- పలు గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- రెంకోని వాగుపై వంతెనల నిర్మాణం పూర్తికాకపోవడం పట్ల ప్రజల అసంతృప్తి




● కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం

ప్రాజెక్టులకు జలకళ!

ఖానాపూర్, జూలై 21 : వారం క్రితం వరకూ వర్షాల్లేక లేక అనేక ఇబ్బందులు పడిన రైతాంగంపై వరుణుడు కరుణించాడు. వరుసగా మూడురోజులుగా జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. విస్తారంగా కురుస్తున్న ఈ వర్షాలకు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఎగువ ప్రాంతాల్లో సైతం భారీగా వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని ప్రాజెక్టులకు క్రమేపీ వరద పెరుగుతోంది. వరద భారీగా రావడంతో జిల్లాలో ఉన్న కడెం, స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలోకి వస్తున్నాయి. కడెం ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా అధికారులు ప్రాజెక్టు వరదగేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. భారీవర్షాలకు పంటచేలలో నీరు నిలవడంతో వరి మినహా మిగతా పంటలకు ఈ భారీ వర్షాలు నష్టం చేకూరుస్తాయని రైతులు కొంత ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం హెచ్చరికలు జారీ చేస్తోంది. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని అధికారులు సూచనలు చేస్తున్నారు.

జిల్లాలో 76.2 మి.మీ. వర్షపాతం నమోదు

గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారంరాత్రి సైతం నిర్మల్ జిల్లాను జోరువాన ముంచెత్తింది. జిల్లా వ్యాప్తంగా 76.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా సారంగాపూర్ మండలంలో 124.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మూడు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తుండడంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జనజీవనం అతలాకుతలమైంది. పలుచోట్ల భారీవర్షాల దాటికి జనం ఇంట్లోంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు.



● నిండుకుండలా దర్శనమిస్తున్న కడెం ప్రాజెక్టు

జలకళను సంతరించుకున్న ప్రాజెక్టులు

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకుంటున్నాయి. ఖానాపూర్ మండలం మేడంపల్లి అడవుల్లో గోదావరి నదిపై అడ్డంగా నిర్మించిన అతిపురాతన రాతి కట్టడమైన సదర్మాట్ ఆనకట్ట వరద నీటితో నిండుకుండలా దర్శనమిస్తోంది. రాతిమత్తడి పైనుంచి గోదావరిలోకి దూకుతున్న వరదనీరు చూపరులను కనువిందుచేస్తోంది. ఈ సుందరదృశ్యాలను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు సదర్మాట్‌కు తరలివస్తున్నారు. మరోవైపు కడెం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు తరలిస్తోంది. ఒక దశలో ఆదివారం ఉదయం సుమరు 26వేల క్యూసెక్కుల వరద నీరు కడెం ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో కడెం ప్రాజెక్టు ప్రస్తుతం జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 690.895 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటిలో సామర్థ్యం 7.603 టీఎంసీలుగా ప్రస్తుతం ప్రాజెక్టులో 5.444 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబు తున్నారు. కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు నాలుగు వరద గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఉదయం 25 వేల 968 క్యూసెక్కుల నీరు రావడంతో నాలుగు వరద గేట్లను ఎత్తి 18,227 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. ఇక జిల్లాలోని మరో సాగునీటి ప్రాజెక్టు అయినా స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు కాగా ప్రస్తుతం 1176.7 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిలో సామర్థ్యం 1.484 టీఎంసీలుగా ప్రస్తుతం ప్రాజెక్టులో 0.891 టీఎంసీల నీరునిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు లోకి 1300 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నట్లు అధికార యంత్రాంగం వెల్లడించింది. ఇక గడ్డెన్నవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 355.90 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 0.733 టీఎంసీల నీరునిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టులోకి 300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఇలా ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో జిల్లాలోని పురాతన ఆనకట్ట సదర్మాట్‌తో సహా మూడు సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకుని నిండుకుండలా దర్శనమిస్తున్నాయి.

ఉప్పొంగిన రెంకోని వాగు

ఖానాపూర్ మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రెంకోనివాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో ఖానాపూర్-తర్లపాడ్, ఖానాపూర్ - దిలావర్‌పూర్ మధ్యలో రెండుచోట్ల రోడ్డు తెగిపోయింది. ఈ రెండుచోట్ల వంతెనల నిర్మాణం జరుగుతుండడంతో పక్కనుండి తాత్కాలిక రోడ్డు ఏర్పాటుచేశారు. రెంకోని వాగుపై రెండు వంతెనల నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెండుచోట్ల రోడ్డు తెగిపోవడంతో ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తెగిపోయిన రోడ్లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరిశీలించారు. వెంటనే వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ సైతం తెగిపోయిన రోడ్లను పరిశీలిచి పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. కావల్సినంత సమయం ఉన్నప్పటికీ పనుల నిర్వహణలో జాప్యం చేసి అధికారులు చేసిన నిర్లక్ష్యంతోటే ఈ పరిస్థితి వచ్చిందని ఖానాపూర్, కడెం మండలం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కడెం ప్రాజెక్టులో చేరుతున్న వరద





దిలావర్‌పూర్ సమీపంలో రెంకోని వాగు ఉధృతికి తెగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



వాగును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్



స్వర్ణ ప్రాజెక్టు కాల్వను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'స్వర్ణ ప్రాజెక్టు కాల్వ ద్వారా నీరు విడుదల చేయాలి'

సారంగాపూర్, జూలై 21 : మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువ ద్వారా సాగునీరును విడుదల చేయాలని మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్వర్ణ ప్రాజెక్టు కాలువలను పరిశీలించి రైతులను వరిసాగుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో వరినాట్లు వేస్తే ఇబ్బందులు ఉండవని, సంబంధిత అధికారులు వెంటనే సాగునీరు విడుదల చేయాలని పేర్కొన్నారు. సాగునీరును విడుదల చేస్తే రైతులు వరినాట్లను వేస్తామని పేర్కొంటున్నారని తెలిపారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు దశరథ్ రాజేశ్వర్, నర్సయ్య, నారాయణరెడ్డి, రాజేశ్వర్, రాజేశ్వర్ రావు, రైతులు ఉన్నారు.

నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ రెఫరీగా షేక్ ఇమ్రాన్

ఖానాపూర్, జూలై21: మండలంలోని మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఇమ్రాన్ అరుదైన ఘనత సాధించారు. గత నెలలో నిర్వహించిన నేషల్ వెయిట్ లిఫ్టింగ్ పరీక్షలో అర్హత సాధించిన షేక్ ఇమ్రాన్ గ్రేడ్-2 నేషనల్ రెఫరీగా ఎంపికయ్యారు. ఈ అరుదైన అర్హతను సాధించిన ఇమ్రాన్‌కు ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అధ్యక్షురాలు శృతి కార్యదర్శి రమణ చేతుల మీదుగా రాతపత్రాన్ని అందజేసినట్లు ఇమ్రాన్ తెలిపారు. మస్కాపూర్‌లో పీడీగా విధులు నిర్వహిస్తున్న ఇమ్రాన్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ గ్రేడ్-2 రెఫరీగా ఎంపికవడం పట్ల స్థానికంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆయనను ఫోన్ ద్వారా అభినందించారు.



గ్రేడ్2 రెఫరీగా రాత పత్రాన్ని అందుకుంటున్న ఇమ్రాన్



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

భైంసాలో భక్తిశ్రద్ధలతో బోనాలు

భైంసా, జూలై21: పట్టణంలోని మహిళలు ఆదివారం మైసమ్మ, పోచమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. పలు కాలనీల వాసులు బాజభజంత్రీలతో శోభయాత్రగా ఆలయాలకు తరలివెళ్లారు. వేకువ జాము నుంచి మహిళలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పట్టణ పరిధిలోని మైసమ్మ, పోచమ్మ మందిరాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేపట్టారు. నియమ, నిష్టలతో పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. తమ కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి, పంటలు ఆశాజనకంగా ఉండాలంటూ మొక్కులు మొక్కారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కుభీర్, జూలై21: మండలంలోని కస్రా గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, నారాయణ్‌పటేల్ వర్గం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శివాజీ మాట్లాడుతూ రుణమాఫీ నిర్ణయంతో రైతులు సంతోషంగా ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



క్షతగాత్రులను బయటికి తీస్తున్న పోలీసులు

అదుపు తప్పి లోయలో పడిన కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను కాపాడిన పోలీసులు

సారంగాపూర్, జూలై 21: మండలంలో గల మహబూబ్ ఘాట్ వద్ద నిర్మల్, స్వర్ణ రహదారిపై ఆదివారం ఉదయం ఓ కారు అదుపు తప్పి లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న ఎస్సైలు గోపీనాథ్, శ్రీకాంత్‌లు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని లోయలో పడి ఉన్న క్షతగాత్రులను బయటితీశారు. సరూర్‌నగర్‌కు చెందిన రాధాకృష్ణ, అతని భార్య, కుమారుడిని చికిత్స నిమిత్తం కోసం నిర్మల్ ఆసుపత్రికి 108లో తరలించారు. దీంతో రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన క్షతగాత్రులను ప్రమాదం నుంచి పోలీసులు రక్షించిన విషయాన్ని తెలుసుకున్న పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎస్పీ షర్మిల జానకికి ఫోన్‌లో ప్రమాదానికి గురైన క్షతగాత్రుల విషయాలను అడిగి తెలుసుకొని వెంటనే చర్యలు చేపట్టిన పోలీసులను అభినందించారు.

కాలనీల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్

- లోతట్టు ప్రాంతాల పరిశీలన

నిర్మల్ చైన్‌గేట్, జూలై 21: గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలోని పలు కాలనీలను మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నెంబర్ 34 ప్రియదర్శిని నగర్‌లో వర్షపు నీరు ఇంటి చుట్టుపక్కల నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందిగా మారిన విషయాన్ని తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, స్థానిక కౌన్సిలర్ ఎర్రవోతు నవనీత సురేష్, కౌన్సిలర్ ముజాహిద్ చౌస్, కాలనీ వాసులతో కలిసి రోడ్డుమార్గానికి అడ్డంగా ఉన్న వర్షపు నీటిని మున్సిపల్ సిబ్బంది ద్వారా తొలగింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంకా కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న చైర్మన్

కడెం ప్రాజెక్టుకు ఏమీ కాదు.. ఆందోళన వద్దు

- కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టు కాబట్టే కడెం చెక్కుచెదరలేదు
- కేసీఆర్, కేటీఆర్ కట్టిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలుసు
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రూ. 9.46కోట్ల నిధులతో కడెంకు మరమ్మతులు చేపట్టాం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



కడెం ఆయకట్టుకు నీటి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్, జూలై 21: కడెం ప్రాజెక్టుకు ఇక ఏమీకాదని, ఈ ప్రాంతప్రజలు భవిష్యత్తులో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని లేదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు భరోసా ఇచ్చారు. కడెం ఆయకట్టు రైతులు వానాకాలం పంట పండించుకునేందుకు అణువుగా కడెం ప్రాజెక్టు నుంచి ఆదివారం ఎమ్మెల్యే సాగు నీటి విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడెం ఎడమ కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీరు కుడి కాలువ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. సాగునీటి కోసం రైతులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా నిరంతరం నీటి సరఫరా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. అంతకుముందు కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వరుసగా గత రెండేళ్ల కడెం ప్రాజెక్టు డేంజర్ బెల్స్ మోగించడం, మైసమ్మ తల్లి కృపతోని బయటపడిందన్నారు. గత పదేళ్ల కాలంలో పాలకులు ఈప్రాంతం వాళ్ల ఉన్నప్పటికీ కడెం ప్రాజెక్టు మరమ్మతుల మాటప్రక్కన పెడితే కనీసం గ్రీసువేసేందుకు కూడాడబ్బులు మంజూరు చేయలేదన్నారు. అయినా భారీ వరదలను తట్టుకొని కడెంప్రాజెక్టు నిలవడానికి కారణంగా కేవలం కాంగ్రెస్ హయాంలో ఆ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసుకోవడమేనని అన్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు కాబట్టే కడెం భారీ వరదలను సైతం తట్టుకొని చెక్కుచెదరకుండా నిలిచి ఉందని అన్నారు. అదే కేసీఆర్, కేటీఆర్ కట్టిన ప్రాజెక్టు అయితే ఈపాటికే ఏమయ్యేదో ప్రజలకు తెలుసునని ఎద్దేవాచేశారు. కడెంప్రాజెక్టు పూర్తిస్థాయి శిథిలావస్థకు చేరిన దశలో గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తమ ప్రభుత్వం రాగానే కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి రూ.9.46 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం కడెంప్రాజెక్టు గేట్లు అన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసుకున్నాయని ఇక ఎటువంటి సమస్యలు తలెత్తవన్నారు. ఎంతటి వరదలు వచ్చినా ప్రాజెక్టు తట్టుకుంటుందన్నారు. నిరంతరం ప్రాజెక్టు వద్ద అధికారుల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్, ఏఈఈ రవికుమార్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, కడెం మండల కాంగ్రెస్ నాయకులు అలెగ్జాండర్, సతీష్ రెడ్డి, కిషన్, దుర్గాభవాని, బొడ్డు గంగన్న, కోల శ్రీనివాస్, ఆకుల లచ్చన్న, కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేష్, నాయకులు పాల్గొన్నారు.